46

# కుక్కతోక

[ఒక మనిషి సంస్కారం ఎంత-అన్నది అతడు మూడవతరగతి రైలు ప్రయాణం చేసేటప్పుడు తెలిసిపోతుందని నా నమ్మకం.
అలాటి ఒక ప్రయాణంలో, గురివిందగింజలాటి నేస్తాలు మరొకరిలోని నలుపును ఎత్తి చూపడమే ఈ కథ (లేక 'స్కెచ్') కు ఆధారం.
పన్నెండేళ్ళ క్రితం రాసిన దీనిని నేడు చదివితే మార్పులేమీ చేయనక్కర లేదనిపించింది. ఒక్క 'పేరు' తప్ప!]

నాలుగో నంబర్ ప్లాట్‌ఫారమ్మీద బొంబే ఎక్స్‌ప్రెస్ నిలబడివుంది—నిండు చూలాలిలా. సెంట్రల్ స్టేషన్ మీద గడియారం ఏడుకొట్టింది. బండి బయలు దేరడానికి పావుగంట వుంది.

నేస్తాలూ కామేశమూ పరుగెత్తుకుంటూ వచ్చారు. నేస్తాలు చేతిలో న్యూస్ పేపరూ లెదర్ బ్యాగూ వున్నాయి.

కామేశం బుట్టతో వున్నాడు. గార్డుపెట్టెనుంచి ఇంజనుదాక మూడుసార్లు తిరిగారు నేస్తాలు లిద్దరూ. కాస్త ఖాళీగావున్న పెట్టెలోకి ఎక్కారు. పాతికమందని నిర్దేశించబడిన పెట్టెలో పదిహేనుమందికూడా లేరు. అయినా కూచోవడానికి స్థలం లేదు!

మిత్రద్వయం చూపులను అష్టదిక్కుల్లోనూ ప్రసరించారు. చిన్నప్పట్నుంచీ నిద్రతప్ప మరోటి ఎరగనట్టు కళ్ళుమూసుకుని పండుకున్నాడు ఓ ఖద్దరు లాల్చీఆయన. శయనానికి ఆ ఆసామీ ఆక్రమించిన స్థలం 'ఎనిమిదిమంది కూచోవడానికి' అని రైల్వేవాళ్ళ అంచనా.

నేస్తాలు అతణ్ణి సమీపించారు.

"మిస్టర్" ... మిస్టర్ కదలలేదు; పలకలేదు.

"ఏ, మిస్టర్!" మిస్టర్ కళ్ళు తెరచాడు.

"కాస్త జరగండి, మేం కూచోవాలి" మిస్టర్ కాస్త కాళ్ళను చాచుకుని మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు.

"మిమ్మల్నేనండీ! మేం కూచోవాలని చెబుతూంటే వినిపించుకోరేం?" అన్నాడు నేస్తాలు.

"ఏమిటయ్యా నీగోలా!" అన్నాడు పండుకున్న మనిషి అంగుళమాత్రమయినా అటూఇటూ కదలకుండా.

"కూచోవాలంటూంటే లేవవేం?" ఏకవచన ప్రయోగం ప్రారంభం.

"ఎందుకు లేవాలీ"

"మేం కూచోవాలి"

"వేరే చోటు చూచుకోండి"

"ఇక్కడే కూచోవాలి జరుగు!"

కామేశం ఇంతసేపూ చూస్తూ నిల్చున్నాడు. కానీ పూర్వాంటే నేస్తాలూ ఆమనిషీ చొక్కా చేతులు పైకి మడుస్తారేమో ననిపించింది.

"ఒరేయ్ నేస్తాలూ, అక్కడ ఖాళీవుంది రారా" అని లాక్కెళ్లాడు మిత్రుణ్ణి.

"హుం... ఇది రైల్వే కంపార్టుమెంటా? పీడి శోభనం గదా...! బుద్ధి లేకపోతే సరి... అడవిమృగం" అంటూ నేస్తాలు కామేశం పక్కన కూచున్నాడు.

నిముషాలు గడుస్తున్నకొద్దీ జనం ఎక్కువవుతున్నారు. కొందరు పైకెక్కి పడుకున్నారు. ఇంకా కొందరు నించునే వున్నారు. ఖద్దరులాల్చీమనిషి...'వెధవ రైల్వేలు! కాస్త తలకి ఎత్తుగా, మెత్తగా ఏదీ ఏర్పాటు చెయ్యరుకదా' అంటూ పక్కకు తిరిగి పడుకున్నాడు.

మొదటిగంట కొట్టారు.

బెడ్డింగుతో ఒక నలభైయేళ్ళ ఆయన ప్రవేశించాడు ఆ పెట్టెలోకి. ఇటూ అటూ చూశాడు. తిన్నగా ఖద్దరులాల్చీ మనిషి పక్కకు వెళ్ళాడు. బెడ్డింగును పందుకునివున్న అతని పాదాలమీదే వుంచాడు.

"ఏమిటయ్యా అదీ! కళ్ళు కనపడ్డంలేదూ?" అనిమండి పడ్డాడు ఖద్దరులాల్చీ ఆయన కళ్లు తెరచి.

బెడ్డింగాయన "కాళ్ళు ముడుచుకో" అన్నాడు ముక్తసరిగా.

"ఎందుకు ముడుచుకోవాలీ?"

"ముడుచుకోవటం కాదు. ఇంకాసేపు ఇలాగేవుంటే గార్డును పిలిపించి కూచోబెడతాను" అంటూ బెడ్డింగును ముందుకుతోస్తూ చోటుచేసుకుని కూర్చున్నాడు కొత్తాయన.

ఇంతసేపణ్నుంచీ నించున్నవాళ్లు నోళ్లు తెరిచారు. నేస్తాలు కంట్లో నవ్వుకనపడింది. కామేశాన్ని తిరిగిచూశాడు.

బండి కదిలింది. ప్రయాణీకులు పక్కవారి పుట్టు పూర్వోత్తరాలను గురించి ప్రశ్నించడం మొదలెట్టారు. ఎక్స్ప్రెస్ రివ్వున వెళ్తొంది.

నేస్తాలూ కామేశమూ మాటాడుకుంటూ వున్నారు. వారిఎదుట జరీలంగవస్త్రం వేసుకుని కళ్ళజోడెట్టుకుని ఒకతను కూచుని వున్నాడు. మధ్యమధ్య మాట కలుపుతున్నాడు.

ఎక్స్‌ప్రెస్ ఆర్కోణంచేరింది; జనం దిగారు. ఎక్కారు రద్దీమాత్రం తగ్గింది. ఎవ్వరూ నిల్చోలేదు. బండి కదలపోతుండగా ఒకతను ఎక్కాడు. నల్లగా, రేగినజుత్తుతో. మొహం మీద కానీ అంత గంధంవుబొట్టుతో వున్నాడు.

బండి వేగం హెచ్చుతూవుంది.

'అయ్యయ్యో...' అన్నాడు గంధపుబొట్టుమనిషి. అతడి మొహం వివర్ణమయింది. జేబులుతడిమి తడిమి చూచుకుంటున్నాడు. ప్రయాణీకు లందరూ అతడిపక్కకు తిరిగి చూచారు.

"అయ్యయ్యో ... పర్సు పోయిందండి నా పర్సు! ఎవడో పాపాత్ముడు...కొట్టేశాడండీ...కష్టపడి మిగిల్చిన నలభై రెండు రూపాయలూ ... తొందరలో ఎవడో... అయ్యో..." అని ఏడిచాడతడు. వివరాలడిగారు కొందరు. తాను ఆర్కోణంలో ఏదో కంపెనీలో ప్యూన్‌గా వున్నాననీ, వారంరోజులు శెలవుతీసుకుని, రెండేళ్ళ తర్వాత రేణిగుంటలో వున్న భార్యాబిడ్డల్ని చూడబోతున్నాననీ మొరపెట్టాడుఅతడు.

"పాపం ... ఎంత దురదృష్టమో చూశారా?" అన్నాడు కళ్ళజోడాయన కామేశంతో.

"మనదేశంలో ఈ జేబుదొంగలు ఎన్నడు నశిస్తారో?" అన్నాడు నేస్తాలు ఉద్రేకంతో.

"జేబుదొంగలూ మనుషులే, వాళ్ళకీ హృదయంవుంది; ఆకలివుంది" అన్నాడు కామేశం నెమ్మదిగా.

"ఇలాంటివాళ్ళ జేబుల్ని కొట్టడమా!" అన్నాడు కళ్ళజోడాయన. పర్సు పోగొట్టుకున్నవాణ్ణి పిలిచాడు "ఇదిగో నోయ్! ఇది వుంచు..." అంటూ తన పర్సులోనుంచి ఒక ఐదు రూపాయల నోటును తీసిచ్చాడు.

కామేశం ఆశ్చర్యంతో నిండిపోయాడు. మొహంమీద కొశ్చెన్ మార్క్‌తో కళ్ళజోడు వ్యక్తివేపు చూచాడు.

"దౌర్భాగ్యుడు కష్టార్జితం పోగొట్టుకున్నాడు. ఏదో చేతనయినంతా...! మనతోటిమానవుడు! అని వెండిరూపాయంత నవ్వుతో విపులీకరించాడు కళ్ళజోడాయన. "నల్గురూ నాలుగు రూపాయలిస్తే పెళ్ళాం బిడ్డల్ని చూసివస్తాడు పాపం" ప్రయాణీకులందరూ అతడివైపుచూసి విస్తుపోయారు.

అందరిలోనూ సంచలనం కలిగింది. డబ్బు పోగొట్టుకున్నవ్యక్తి వాళ్ళ ఆలోచనలకి విస్తుపోయాడు. కళ్ళజోడాయన ఐదురూపాయ లివ్వడంచూచి తను జేబుల్లోకి చేతులు పోనిచ్చారు. కొందరు సానుభూతితో. మరికొందరు అహంకారంతో, ఇంకా కొందరు నిర్లక్ష్యంతో ఇలా ఇంచుమించు

అందరూ తలో పావలా, అర్ధరూపాయీ, రూపాయీ ఇచ్చారు. ఖద్దరులాల్చీ నుంచికూడా బయట కొచ్చిందొక అణాకాసు. బెడ్డింగాయన మొహాన్ని 'హిందూ' పేపరు కప్పి పుచ్చింది పాపం!

గంధపుబొట్టువ్యక్తి అందరికీ వందనాలు చెబుతూ చందాలందుకున్నాడు. 'ఏదో...సాయంచేశాం! బాగు పడ్డాడు—' అనుకున్నారు చందాదారులు హుందాతనంతో.

ఇంతసేపూ—నేస్తాలు, గంధపుబొట్టు మనిషినే వివిధ కోణాల్నుంచి చూడటం—కాసేపు కళ్ళు మూసుకోవడం మళ్ళీ తెరచి, వాణ్ణేచూడడం—ఇలా సాగించాడు.

కామేశం అన్నాడు నేస్తాలుతో "దేశంలో దొంగ లున్నారని ఇందాకవాపోయానే... ఇపుడుచూడవోయ్ సోదర మానవుడికి ఎంత సాయంచేశారో...! ఇందు కేమంటావ్?"

నగరి స్టేషను వచ్చింది. కళ్ళజోడువ్యక్తి 'వస్తానండీ' అని దిగిపోయాడు. మరో నల్గురూ అక్కడే దిగారు. ఎవరూ ఎక్కలేదు.

పెట్టెలో కాస్త సందడితగ్గింది. ఇద్దరో ముగ్గురో కునుకు తీస్తున్నారు.

డబ్బుపోగొట్టుకున్న గంధపుబొట్టు మనిషి తలుపు వారగా కూర్చున్నాడు.

నేస్తాలు గబుక్కున లేచాడు. తిన్నగా వెళ్ళి వాడిపక్కన కూచుని "ఒరేయ్" అన్నాడు.

"దొంగవెధవా! ఈ నాటకం ఇక్కడ కూడానా?" అన్నాడు. గంధపుబొట్టు మనిషి కళ్ళల్లో భయం మెదిలింది. కామేశం నేస్తాల్ని ఆశ్చర్యంతో చూస్తున్నాడు. తక్కిన వారెవరూ దీన్ని గమనించినట్టు లేరు.

"రాస్కెల్! మొన్న నేను కలకత్తామెయిల్లో చూడలేదుట్రా? సూళ్ళూరుపేటలో ఎక్కి గడబిడచేసి దాదాపు ముప్ఫైరూపాయలు పోగుచేసుకోలే...? రోగ్!...నువ్వూ వాడూచేరి ఇదానాటకం?" అన్నాడు నేస్తాలు నెమ్మదిగానే.

గంధపుబొట్టుమనిషి "సార్, సార్! మన్నించండి-మహాప్రభువులు! ఇదే పొట్టకూటికి మార్గమండీ..." అన్నాడు.

"ఇలా ప్రయాణీకుల్ని మోసగించడమూ నీమార్గం...? స్టేషను రానియ్యి? చెబుతా. నిన్నొకసారి పోలీసులకి అప్ప చెబుతేగానీ..."

"అయ్యో, అయ్యో! ఆపని చెయ్యకండి బాబూ! మీ కాళ్ళమీద పడతానండీ...నన్నొదిలిపెడితే ఇంకెక్కడయినా ...బతికిపోతాను"

"ఎక్కడికిపోయినా ఇదే మొదలెడతావ్...హుమ్... ఇవాళ ఎంత సంపాదించావ్...?"

"నలభై దగ్గర ..."

"తీయ్ బయటికి"

"బాబూ ... బాబూ ..." అంటూ జేబుల్లోకి చేతుల్ని పోనిచ్చి, చేతుల్నిండా బయటికి తీశాడు. రెండు అయిదు రూపాయల కాగితాలూ, కొన్ని రూపాయనోట్లూ. గుప్పెడు చిల్లరావుంది.

పుత్తూరుస్టేషను వచ్చింది. బండి అగింది. కరివేపాకు వాసన ఘుమ్మని వీస్తోంది.

ఇంజను కూతపెట్టింది. హఠాత్తుగా ఆ వ్యక్తి నేస్తాలు చేతుల్నిలాగి ఏదోవుంచాడు. గబగబా దిగిపోయాడు. బండి కదిలింది. నేస్తాలు తలుపుదగ్గర నుంచుని బయటికి చూస్తున్నాడు.

ఒక్క ఊపుతో కామేశం నేస్తాలు పక్కకొచ్చిపడ్డాడు.

"నేస్తాలు ... నేస్తాలూ" నేస్తాలు తిరిగాడు.

"చూడరా ... ఈ వెధవ ప్రతీబండిలో ఎక్కడం, ఇలాగే గుండెలు కరిగిపోయేలా పర్సుపోగొట్టుకున్నానని కథచెప్పడం. వీడికి ముందుగానే వాడు ఇక్కడకూచుని, వీడాకథ చెప్పగానే మహాసానుభూతి ఏడిచినట్టు ఒక్క అయిదురూపాయలివ్వడం, ముక్కుమీదవేలేసుకుని మనమందరం తలోరూపాయిఇవ్వడం!

ఇలా సునాయాసంగా మనకళ్ళలో దుమ్ముకొట్టి రోజుకి యాభయి, వందా సంపాదిస్తారు వీళ్లు..."

"అదిసరేగానీ...నీచేతిలో అదేవిటీ?"

"పదిరూపాయలు! వాడిచ్చాడు"

"ఎందుకు పుచ్చుకున్నావ్?"

"వాడిచ్చిపోయాడు"

"ఎందుకూ?"

"నీతికి భయపడి..."

"నీతి...ఏదదీ?"

"వాడావిధంగా ప్రజల్ని దోచుకుంటూంటే అడ్డగించడం నా ధర్మంకాదూ? అంచేతవాణ్ణిఅడ్డగించాను. న్యాయానికి భయపడి వాడిది ఇచ్చివెళ్లాడు. ఇహముందు కాస్త జాగ్రతగా వుంటాడు...చట్టానికి భయపడుతూ" అన్నాడు నేస్తాలు.

"చట్టం! నీతి! చక్కటిపదాలు ... వాడిపొట్టకోసం వాడొకమార్గం అవలంబించాడు. అందులో తప్పేవిటి? వ్యాపారస్తులు వేలకివేలు దోచడంలేదూ?"

"కామేశం ... ఏవిటోయ్ ధర్మపన్నాలు వల్లిస్తు

న్నావ్!'' అన్నాడు నేస్తాలు—గాలికి చేతిలో రెపరెపలాడుతున్న రెండయిదురూపాయల నోట్లను చూస్తూ.

సీటుకెళ్ళి కూచోబోతూ అన్నాడు కామేశం. ''ధర్మపన్నాలు కావోయ్! వాడలా దోచడం అవినీతి. దోచిన సొమ్ములో నీకు కాస్త లంచమిచ్చేసరికి అవినీతి నీతయింది. అలా మారిపోవడానికి... నీతి బంకమట్టి ముద్దటరా నేస్తాలూ?''

కామేశం పక్కకొచ్చాడు నేస్తాలు.

''ఓయ్ సోమయాజులూ! అటే మాటాడకోయ్'' అంటూ ఒక్క అయిదురూపాయల కాగితాన్ని కామేశం చొక్కా జేబులో వుంచాడు. ఆ నోటును చూచుకుని, జేబు సర్దుకుని వెనక్కిపోతున్న టెలిగ్రాము స్తంభాల్ని లెక్కించడం మొదలెట్టాడు కామేశం...

(''ఆనందవాణి'' 55)